క్లుప్తంగా

మృతుడి కుటుంబానికి సాయం



కోడూరు: ఇటీవల మృతిచెందిన విశ్వనాథపల్లి పీఏసీఎస్ సభ్యుడు తోట స్వాములు కుటుంబానికి సంఘం ఆధ్వర్యంలో రూ.10 వేలను చైర్‌పర్సన్ తోట వెంకట నాంచారమ్మ బుధవారం అందించారు. సీఈఓ చుండూరు రమేష్, వైఎస్సార్ సీపీ రైతు విభాగం కార్యదర్శి కొండవీటి వీరవెంకట నారాయణరావు, జిల్లా సంయుక్త కార్యదర్శి తోట దామోదరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

● **ఘంటసాల(అవనిగడ్డ):** ఘంటసాల మండలం కొత్తపల్లి పీఏసీఎస్ సంఘ సభ్యురాలు సూరపనేని వెంకట లక్ష్మి ఇటీవల మృతిచెందారు. పీఏసీఎస్ చైర్‌పర్సన్ తాతినేని వెంకట కృష్ణారావు మృతురాలి కుమారుడు శివరామ ప్రసాద్‌కు రూ. 10 వేలను అందించారు. కార్యక్రమంలో సంఘం సీఈఓ, సంఘ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

కృత్తివెన్ను: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సీతనపల్లి గ్రామంలో గురువారం జరుగుతుందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వైదాని వెంకట్రాజు తెలిపారు. మధ్యాహ్నం ఒంటి గంటకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ ఇంటింటికీ వెళ్లి స్థానికుల సమస్యలు తెలుసుకుంటారని చెప్పారు.

పాస్టర్లకు సైకిళ్లు అందజేత



పురిటిగడ్డ(చల్లపల్లి): ఆధ్యాత్మిక పథంలో పయనించాలనే ఆలోచనే నిజమైన సంపద అని ఇండియా విలేజ్ మినిస్ట్రీస్ స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ డాక్టర్ వేములపల్లి సురేష్ అన్నారు. బుధవారం స్థానిక ఐవీఎం కార్యాలయంలో అవనిగడ్డ నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన నిరుపేద దైవ సేవకులు నలభై మందికి ఐవీఎం ఆధ్వర్యంలో సంస్థ డైరెక్టర్ సురేష్ రూ.2 లక్షల 30 వేలు విలువచేసే సైకిళ్లను అందజేశారు. ఐవీఎం సురేష్‌కు పాస్టర్లు కృతజ్ఞతలు తెలిపారు.

వాహనాల తనిఖీ



మోపిదేవి: రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా మోపిదేవి ప్రధాన సెంటర్‌లో ఎస్‌ఐ పద్మ వాహనాలను బుధవారం తనిఖీ చేశారు. ఎస్‌ఐ మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా లైసెన్సు కలిగి ఉండాలన్నారు. వాహనానికి పొల్యూషన్ సర్టిఫికెట్, ఆర్‌సీ బుక్‌తో పాటు ఇన్సూరెన్స్ చేయించుకోవాలని సూచించారు. హెల్మెట్ ధరించాలని, త్రిబుల్ రైడింగ్ చేయరాదని స్పష్టంచేశారు. పాత చలానాల రుసుం కట్టించారు.

ఈకేవైసీ అనుసంధానం గడువు పెంచాలి

మచిలీపట్నంటౌన్: ఈకేవైసీకి సీఎఫ్ఎంఎస్, ఆధార్, ఫోన్ నెంబర్ అనుసంధానానికి గడువు పెంచాలని ఏపీ స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ కృష్ణా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె. రాజేంద్రప్రసాద్, సీహెచ్ ఆశీర్వాదం కోరారు. ఈ మేరకు వారు బుధవారం స్థానిక జిల్లా ఖజానాధికారి రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఈ నెల 20వ తేదీలోగా రిటైర్డ్ ఉద్యోగులు వారి సీఎఫ్ఎంఎస్, ఆధార్, ఫోన్ నెంబర్లు ఈకేవైసీకి అనుసంధానం చేయాలని ప్రభుత్వం గడువు విధించిందన్నారు. కొంతమంది రిటైర్డ్ ఉద్యోగులు అనారోగ్యంతో బాధపడుతున్నారని, కొంతమంది ఇతర ప్రాంతాలకు వెళ్లారని, ఈకేవైసీపై వారికి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఈకేవైసీ గడువు పెంచాలని కోరారు.

ఎన్టీఆర్‌కు నివాళి



నాగాయలంక: తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీ రామారావు వర్ధంతి కార్యక్రమం బుధవారం ఆ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక పంచాయతీ కార్యాలయం సెంటర్‌లో నిర్వహించారు. తూర్పుబజారు రామాలయం సెంటర్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ నాయకుడు మండలి వెంకట్రామ్ (రాజా), టీడీపీ కృష్ణా జిల్లా మహిళా అధ్యక్షురాలు తలశిల స్వర్ణలత, ఏఎంసీ మాజీ చైర్మన్ ఎం.బాలవర్ధిరావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి చేయండి



ప్రమాణ స్వీకారం చేస్తున్న భద్రాద్రి రామాలయం పాలకవర్గ సభ్యులు



మాట్లాడుతున్న పేర్ని కిట్టు

పాలకవర్గం ప్రమాణ స్వీకారోత్సవంలో పేర్ని కిట్టు

మచిలీపట్నంటౌన్: రుస్తుంబాద భద్రాద్రి రామాలయ అభివృద్ధికి నూతన పాలకవర్గం కృషి చేయాలని వైఎస్సార్ సీపీ నాయకుడు పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. బుధవారం ఆలయ ప్రాంగణంలో ఆలయ నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం ఘనంగా నిర్వహించారు. నూతన పాలకవర్గాన్ని పేర్ని కిట్టు అభినందించి మాట్లాడారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సేవలు అందేలా చూడాలన్నారు. భక్తుల రాకను పెంపొందించే కార్యక్రమాలు రూపొందించి అమలు చేయాలని చెప్పారు. ఆలయ కమిటీ అధ్యక్షుడిగా అనుమకొండ శ్రీధర్, సభ్యులుగా వేప రామస్వామి (బాబులు), అశ్వధాటి పూర్ణచంద్రరావు, తాడివాక పద్మ, అలగలశెట్టి విజయ, కేశన బేబి సరోజిని, సోడాబత్తుల లలిత, దిట్టకవి బాలశేష కృష్ణమాచార్యులు ప్రమాణస్వీకారం చేశారు. వీరితో ఆలయ ఈఓ గోవాడ వెంకటకృష్ణారావు ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో 44వ డివిజన్ కార్పొరేటర్ మామిడిబత్తుల రోజా, డివిజన్ ఇన్‌చార్జి మామిడిబత్తుల అజయ్, తరకటూరు ఎంపీటీసీ సభ్యుడు జక్కా ధర్మారాయుడు, అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ శ్రీకాకోళపు రేణుకారాణి, కో–ఆప్షన్ సభ్యుడు బేతపూడి రవి, వైఎస్సార్ సీపీ నాయకులు ధనికొండ శ్రీనివాసరావు, గాజుల భగవాన్, మరీదు నాగరాజు, షేక్ మొహమ్మద్ సాహెబ్, చీలి చక్రపాణి, బూరగ రామారావు, సత్తెనపల్లి శ్రీనివాసరావు, పీఏఎస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

25 నుంచి సుబ్బారాయుడి బ్రహ్మోత్సవాలు

మోపిదేవి(అవనిగడ్డ): ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 25 నుంచి 29వ తేదీ వరకు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు తెలిపారు. వైదిక కార్యక్రమాలతో పాటు ఆలయ ప్రాంగణంలో పలు సాంస్కృతి కార్యక్రమాలు కూడా సంప్రదాయబద్ధంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. స్వామివారి బ్రహ్మోత్సవాల సమయంలో దేవాలయంలో నిత్య ఆర్జిత సేవలు నిలిపివేయనున్నట్లు ప్రకటించారు.

● 25వ తేదీ ఉదయం 11 గంటలకు స్వామివారిని పెండ్లికుమారుని చేయటం, ఎండోమెంట్ తరఫున స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తారని చెప్పారు. రాత్రి 7 గంటలకు యాగశాల ప్రవేశం, విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవాచన తదితర పూజా కార్యక్రమాలు ఉంటాయన్నారు. 26వ తేదీ గురువారం ఉదయం 5 గంటలకు సుప్రభాతసేవ, ప్రాతఃకాలార్చన, పంచామృత స్నపన, నిత్య హోమం, బలిహరణ మధ్యాహ్నం 2 గంటలకు శేష వాహనంపై గ్రామోత్సవం, రాత్రి 7 గంటలకు స్వామివారి ఎదురుకోలు ఉత్సవం, 8 గంటలకు స్వామివారి దివ్యకల్యాణ మహోత్సవం, అనంతరం నందివాహనంపై గ్రామోత్సవం ఉంటుందన్నారు.



వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారు

● 27వ తేదీ ఉదయం సుప్రభాత సేవ, ప్రాతఃకాలార్చన, పంచామృతస్నపన, రాత్రి 8 గంటలకు కనుల పండువగా స్వామివారి రథోత్సవం ఉంటుందన్నారు.

● 28వ తేదీ ఉదయం 5 గంటలకు సుప్రభాతసేవ, ప్రాతఃకాలార్చన, పంచామృతస్నపన తదితర పూజాకార్యక్రమాలు, ఉదయం 9 గంటలకు వసంతోత్సవం, అవభృతస్నానోత్సవం, సుబ్రహ్మణ్య మాల దీక్ష విరమణ, పూర్ణాహుతి, రాత్రి ఏడు గంటలకు శమీవృక్షపూజ, రాత్రి 8 గంటలకు మయూర వాహనంపై గ్రామోత్సవం ఉంటాయని చెప్పారు.

● 29వ తేదీ ఉదయం 5 గంటలకు సుప్రభాతసేవ, ప్రాతఃకాలార్చన, పంచామృత స్నపన, ఉదయం 10 గంటలకు సుబ్రహ్మణ్య హవనం, రాత్రి 7 గంటలకు ద్వాదశ ప్రదక్షిణలు, రాత్రి 8 గంటలకు స్వామివారి పుష్పశయ్యాలంకృత పర్యంకసేవ నిర్వహిస్తామన్నారు.

● వీటితో పాటు 26న సాయంత్రం 6 గంటలకు కూచిపూడి, 27న సాయంత్రం 6 గంటలకు భరతనాట్యం, 28న సాయంత్రం 9 గంటలకు సత్యహరిశ్చంద్ర నాటకం, 29న రాత్రి 9 గంటలకు తిరుపతమ్మ కథ నాటక ప్రదర్శన ఉంటాయన్నారు.

రెండు నిట్టాడుల పూరిల్లు దగ్ధం

రూ. ఐదు లక్షల ఆస్తి నష్టం

కోడూరు: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో రెండు నిట్టాడుల పూరిల్లు దగ్ధమైంది. ఈ ఘటన కోడూరు మండలం స్వతంత్రపురంలో బుధవారం చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం.. స్వతంత్రపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో ఉప్పలపాటి శ్రీనివాసరావు, ఈశ్వరమ్మ దంపతులు రెండు నిట్టాడుల పూరిల్లు వేసుకొని నివాసముంటున్నారు. శ్రీనివాసరావు దంపతులు మంగళవారం పనిపై బయట గ్రామానికి వెళ్లారు. బుధవారం వేకువజామున మూడు గంటల సమయంలో శ్రీనివాసరావు ఇంటి నుంచి మంటలు రావడాన్ని పక్కనే ఉన్న గృహస్తులు గమనించారు. మంటలు పక్కకు వ్యాపించకుండా అదుపు చేయడంతో పాటు అవనిగడ్డ అగ్నిమాపక సిబ్బందికి సమాచారమిచ్చారు. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. గృహోపకరణలు, విలువైన సామగ్రి, నగదు, బంగారంతో పాటు విలువైన పత్రాలు కాలిపోయాయని బాధితులు విలపించారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.5 లక్షల ఆస్తినష్టం జరిగిందని అధికారులు అంచనా వేశారు.

రెడ్‌క్రాస్ చేయూత..

అగ్ని బాధితులకు రెడ్‌క్రాస్ సొసైటీ మండల శాఖ ఆధ్వర్యంలో బియ్యం, నిత్యావసర సరుకులు, కూరగాయలు, గృహోపకరణలు, దుస్తులను అందించారు. తహసీల్దార్ షేక్ లతీఫ్‌పాషా ఘటనాస్థలాన్ని పరిశీలించి, ప్రభుత్వం తరఫున తక్షణ సాయంగా బియ్యం, రూ.5 వేల నగదు అందించారు. సొసైటీ చైర్మన్ వేజెండ్ల శ్రీనివాసరావు, సభ్యులు పాల్గొన్నారు.



కాలిపోయిన గృహోపకరణలు



దగ్ధమైన బీరువా, దుస్తులు

నేటి నుంచి ఆధార్ శిబిరాలు

గూడూరు: గూడూరు మండలంలోని గూడూరు–1, మల్లవోలు–1, కంకటావ గ్రామ సచివాలయాల్లో గురువారం నుంచి ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ శిబిరాలు నిర్వహిస్తామని గూడూరు ఎంపీడీఓ డి.సుబ్బారావు తెలిపారు. ఈనెల 24 వరకు నిర్వహించే శిబిరాలలో సమీప గ్రామాల వారీగా ఆధార్ సేవలు అందిస్తామని ఆయన చెప్పారు. దీనికి సంబంధించిన షెడ్యూల్‌ను ఆయన విడుదల చేశారు. 19న మల్లవోలు, రామానుజవత్తర్లపల్లి, గూడూరు, 20న ఐదుగుళ్లపల్లి, రామన్నపేట, పోలవరం, ముక్కొల్లు, తరకటూరు, 21న రాయవరం, లేళ్లగరువు, కోకనారాయణపాలెం, 23న కంచాకోడూరు, ఆకుమర్రు, మద్దిపట్ల, కలపటం, పోసినవారిపాలెం, 24న రామరాజుపాలెం, కంకటావ, ఆకులమన్నాడు గ్రామాల ప్రజలకు ఆధార్ సేవలు అందుబాటులో ఉంటాయని వివరించారు. ఆయా గ్రామాల ప్రజలు సేవలను వినియోగించుకోవాలని ఆయన కోరారు.

కొట్లాటపై కేసు నమోదు

కోనేరుసెంటర్: బార్‌లో మద్యం మత్తులో జరిగిన కొట్లాటపై ఆర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో బుధవారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మచిలీపట్నం పాత రామన్నపేటకు చెందిన మాగంటి సాయికుమార్ బార్ అండ్ రెస్టారెంట్‌లో చెఫ్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 17వ తేదీన అతని స్నేహితుడి పుట్టినరోజు కావడంతో నగరంలో బార్ అండ్ రెస్టారెంట్‌లో మద్యం సేవించేందుకు స్నేహితులంతా కలిసి వెళ్లారు. అప్పటికే మద్యం మత్తులో అక్కడ ఉన్న ఓగీసుపేటకు చెందిన కొంత మంది సాయికుమార్‌తో గొడవకు దిగారు. సర్దుబాటు చేసుకుని అక్కడి నుంచి వెళ్లిపోయేందుకు ప్రయత్నించిన సాయికుమార్‌పై అకారణంగా దాడి చేసి గాయపరిచారు. సాయికుమార్‌తో పాటు అతని స్నేహితుడిపైనా దాడి చేసి గాయపరిచారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆర్‌పేట పోలీసులు తెలిపారు.

వృద్ధులకు అన్నదానం

పెనమలూరు: వణుకూరులో వృద్ధులకు బుధవారం దాతలు అన్నదానం చేశారు. వణుకూరు ఆదరణ వృద్ధుల ఆశ్రమంలో పడమట నాగభూషణం, నాంచారమ్మ దంపతులు పడమట వీరమ్మ జ్ఞాపకార్థం 40 మంది వృద్ధులకు అన్నదానం చేశారు.

ఈక్రాప్ నమోదు తప్పనిసరి

పెడన: మండలంలోని రైతులు ఈక్రాప్, ఈకేవైసీ నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని మండల వ్యవసాయ శాఖాధికారి జీవీ శ్రీనివాసరావు అన్నారు. బుధవారం ఆయన టెలీ కాన్ఫరెన్స్‌లో ఈ క్రాప్ నమోదుపై వీఏఏ, ఎంపీఈఓలతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ఈ క్రాప్ నమోదులో పెడన మండలం ఎనిమిదో స్థానంలో ఉందన్నారు. పెడన మండలంలో 21,498 ఎకరాలకుగాను 16,627 ఎకరాల్లో వరి సాగు చేశారని చెప్పారు. ఇప్పటివరకు 13,565 ఎకరాలకు సంబంధించి రైతుల వివరాలను ఈ క్రాప్ నమోదు చేశామన్నారు. దీంతో పెడన మండలంలో ఈ క్రాప్ 82 శాతం పూర్తయిందని, మిగిలిన 18 శాతం కూడా ఈ నెలఖారులోగా పూర్తి చేసి అగ్రస్థానంలో మండలాన్ని నిలుపుదామని చెప్పారు. ఈ క్రాప్ నమోదు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయాలని సూచించారు. ఈ క్రాప్ పూర్తయిన వెంటనే రైతుల వివరాలను క్రాస్ చెక్ చేసిన ఈకేవైసీకి సంబంధించి రైతుల నుంచి వేలిముద్రలు లేదా ఫోన్ నెంబర్ల ద్వారా ఓటీపీ తీసుకోవాలన్నారు. ఈక్రాప్, ఈకేవైసీ తప్పనిసరిగా రైతులు చేయించుకునేలా ప్రోత్సహించాలని చెప్పారు.

వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు

ఎంపీపీ గరుడప్రసాద్

కృత్తివెన్ను: తీర ప్రాంతమైన కృత్తివెన్ను మండలంలో రానున్న వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ కూనసాని గరుడప్రసాద్ అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వివిధ శాఖల ద్వారా అమలవుతున్న సంక్షేమ పథకాలపై సమీక్షించారు. జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని సూచించారు. గ్రామాలలో సీసీ రోడ్ల నిర్మాణంపై పలువురు సర్పంచ్‌లు ప్రశ్నించారు. గతంలో వేసిన రోడ్లకు సోషల్ ఆడిట్ పూర్తయితే ఇప్పుడు సీసీ వేసుకునేందుకు అనుమతి తీసుకోవచ్చని అధికారులు తెలిపారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు మైల రత్నకుమారి, ఉప సర్పంచ్‌లు సత్యనారాయణ, శిరీష, ఎంపీడీఓ పిచ్చిబాబు, డీటీ శశికుమార్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా ముగిసిన గ్రామోత్సవం

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడులోని వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో జరుగుతున్న సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి గ్రామోత్సవం ప్రసాదంపాడులో కొనసాగుతోంది. గత ఐదు రోజులుగా రామవరప్పాడు, ప్రసాదంపాడు వీధుల్లో జరుగుతున్న గ్రామోత్సవం గురువారం తెల్లవారుజామున పూర్తవుతుంది. పలు గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారి ఉత్సవ వాహనాన్ని అనుసరిస్తూ మొక్కులు తీర్చుకున్నారు. పలువురు మహిళలు పసుపు నీళ్ల వాహనం ఎదుట పోసి అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ బోయిన భానుప్రదీప్, ఆలయ కార్యనిర్వహణాధికారి పి. లోకేశ్వరి మాట్లాడుతూ గత ఐదు రోజుల నుంచి అమ్మవారి గ్రామోత్సవం అత్యంత వైభవంగా జరుగుతోందన్నారు. అనుకున్న సమయానికంటే గ్రామోత్సవానికి సమయం ఎక్కువ సమయం పడుతుండటంతో తెప్పోత్సవం, పూలంకి సేవ అర్ధరాత్రి దాటిన తర్వాత గురువారం తెల్లవారుజామున జరుగుతుందని తెలిపారు. ఉత్సవాల్లో అమ్మవార్లకు రామవరప్పాడు, ప్రసాదంపాడు గ్రామస్తులు కానుకల రూపంలో హుండీల్లో సమర్పించిన ఆదాయాన్ని ఈనెల 19న లెక్కిస్తామన్నారు.



అమ్మవారి గ్రామోత్సవం

సుబ్బారాయుడికి విరాళం



ముదినేపల్లి రూరల్: సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్‌లోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో అంతరాలయ ముఖద్వారానికి బుధవారం మండలంలోని శ్రీహరిపురానికి చెందిన బొగ్గవరపు సుబ్రహ్మణ్యం, నాగసీతామహాలక్ష్మి దంపతుల కుమార్తె దేవీ నాగవెంకట సాయికీర్తి వెండి తాపడం నిమిత్తం రూ.10,116 విరాళాన్ని అందించారు. ఆలయ చైర్మన్ కొంతి నాగరాజు, సహాయ కమిషనర్ నేల సంధ్య, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు వితరణ

హనుమాన్‌జంక్షన్ రూరల్: ఎన్నో వ్యయ, ప్రయాసలకు ఓర్చి దివ్యాంగులకు విద్య, వసతి సదుపాయాలను కల్పిస్తున్న స్వచ్ఛంద సంస్థల సేవలు అభినందనీయమని విశ్రాంత ఎంఈఓ, మానవత కన్వీనర్ ఘంటా సత్యనారాయణ అన్నారు. స్థానిక ఆదిత్య బధిరుల పాఠశాల, ఆశాజ్యోతి దివ్యాంగుల సొసైటీలకు బుధవారం ఆయన రూ.6 వేలు విరాళం అందజేశారు. బధిరుల పాఠశాల కరస్పాండెంట్ ఆకుల వెంకట రమణ మానవత సభ్యులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధానికి కట్టుబడి ఉన్నాం

కృష్ణా జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో పర్యావరణాన్ని కాపాడేందుకు ప్లాస్టిక్ వాడకం నిషేధాన్ని కచ్చితంగా ప్రభుత్వం అమలు చేస్తోందని కృష్ణా జిల్లా కలెక్టర్ పి. రంజిత్‌బాషా అన్నారు. ఆయన చాంబర్‌లో బుధవారం కాలుష్య నియంత్రణ మండలి సమావేశం నిర్వహించారు. జిల్లా ప్రజలు కాలుష్యానికి గురికాకుండా తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో ఆయన చర్చించారు. కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చీఫ్ ఎగ్జిక్యూటివ్ సమీర్‌శర్మ ఈ నెల 20వ తేదీన జిల్లాలో పర్యటించనున్నారన్నారు. జిల్లాలోని వివిధ పంచాయతీల్లో ఇంటింటికీ చెత్త సేకరణ అంశంపై నివేదికలు సిద్ధం చేసుకోవాలన్నారు. సంబంధిత ఫొటోలు, వీడియో క్లిప్పింగ్స్‌తో సిద్ధంగా ఉండాలని డీపీఓ నాగేశ్వరనాయక్‌కు సూచించారు. వినియోగించకుండా వదిలేసే ప్లాస్టిక్ భూగోళానికి, జలవనరులకు కలిగిస్తున్న ప్రతికూల ప్రభావాలను పరిగణనలోకి తీసుకుని ఏక వినియోగ ప్లాస్టిక్‌ను పూర్తిగా నిర్మూలించాలన్నారు. కాలుష్య నియంత్రణ మండలి బోర్డు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ప్రసాదరావు, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి వెంకట్రావు, మునిసిపల్ కమిషనర్లు జి. చంద్రయ్య, పి. వెంకటేశ్వరరావు, అంజయ్య పాల్గొన్నారు.

ప్రతి రోజూ ఆర్బీకే, రైస్‌మిల్లులను సందర్శించండి

జేసీ అపరాజితసింగ్

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో ధాన్యం కొనుగోలులో రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ప్రతిరోజు రైతు భరోసా కేంద్రం, రైస్‌మిల్లులను సందర్శించాలని జాయింట్ కలెక్టర్ అపరాజితసింగ్ రెవెన్యూ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లోని సమావేశపు హాల్‌లో బుధవారం ధాన్యం కొనుగోలు ప్రక్రియ, లంకభూముల గుర్తింపు, రీ–సర్వే, ఈకేవైసీ నమోదు అంశాలపై తహసీల్దార్లు, డెప్యూటీ తహసీల్దార్లతో సమావేశం నిర్వహించారు.

జేసీ మాట్లాడుతూ డిసెంబర్ నెలలో కురిసిన వర్షాలకు పలు మండలాల్లో ధాన్యం తడిచి రంగు మారిందని, రంగుమారిన ధాన్యం, నూకలైన ధాన్యం కొనుగోలు చేసేందుకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. అలాగే కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా తహసీల్దార్లు ప్రతి రోజూ రెండు రైస్‌మిల్లులు, మూడు రైతుభరోసా కేంద్రాలను సందర్శించి పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షించాలన్నారు. నదీ తీర ప్రాంతంలోని లంక భూములను గుర్తించి నివేదికలు ఇవ్వాలని చెప్పారు. రీ-సర్వే ప్రక్రియను వేగవంతం చేసి రైతులకు భూ హక్కు పత్రాలను పంపిణీ చేయాల్సి ఉందన్నారు. తహసీల్దార్లు వీటన్నింటిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో డీఆర్వో ఎం. వెంకటేశ్వర్లు, ఆర్డీఓలు ఐ. కిషోర్, బి. పద్మావతి, కె. విజయకుమార్, సివిల్ సప్లయిస్ డీఎం శ్రీధర్, డీఎస్ఓ వి. పార్వతి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జేసీ అపరాజితసింగ్

అర్హతే ప్రామాణికంగా పథకాలు

పేర్ని కిట్టు

మచిలీపట్నంటౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అర్హత ఉన్న ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని వైఎస్సార్ సీపీ నాయకుడు పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. పదో డివిజన్‌లో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదా, కార్పొరేటర్ షేక్ ముంతాజ్‌బేగం, వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి షేక్ బాషాలతో కలిసి పేర్ని కిట్టు గడప గడపకు వెళ్లి స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన సంక్షేమ పథకాల వివరాలతో ముద్రించిన బ్రోచర్లను పేర్ని కిట్టు లబ్ధిదారులకు అందజేశారు. కిట్టు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర చేసిన సమయంలో ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నారన్నారు. దీనిలో భాగంగానే అన్నివర్గాల ప్రజలను ఆదుకునేందుకు సంక్షేమ పథకాలను రూపొందించి అమలు చేస్తున్నారని తెలిపారు. తనకు వివిధ పథకాల ద్వారా మొత్తం రూ. 1,54,393 లబ్ధి చేకూరిందని స్థానికుడు వీర్ల మొగ్గయ్య పేర్ని కిట్టుకు తెలిపారు. కార్యక్రమంలో మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ జక్కుల ఆనందబాబు, కార్పొరేటర్లు మేకల సుబ్బన్న, రామిశెట్టి వాణిశ్రీ, వైఎస్సార్ సీపీ నాయకులు చిటికిన నాగేశ్వరరావు, గాజుల భగవాన్, మొహమ్మద్ రఫీ, బూరగ రామారావు, చీలి చక్రపాణి, కేశన నాని, శ్రీరాం తదితరులు పాల్గొన్నారు.



స్థానికుల సమస్యలు తెలుసుకుంటున్న పేర్ని కిట్టు

సీపీఐ నేత బాబూరావుకు ఎమ్మెల్యే సింహాద్రి నివాళి

వక్కలగడ్డ(చల్లపల్లి): సీపీఐ సీనియర్ నాయకుడు, ప్రజా నాట్య మండలి కళాకారుడు వక్కలగడ్డ గ్రామానికి చెందిన రావి బాబూరావు భౌతిక కాయాన్ని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు బుధవారం సందర్శించి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ పరిశీలకుడు కడవకొల్లు నరసింహారావు, వక్కలగడ్డ సర్పంచ్ వల్లూరు ఉమా, ఏఎంసీ డైరెక్టర్ మోతుకూరి ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు. అలాగే బాబూరావు భౌతిక కాయాన్ని ఆలిండియా కిసాన్ మహాసభ జాతీయ ఉపాధ్యక్షుడు రావుల వెంకయ్య, సీపీఐ రాష్ట్ర నాయకురాలు అక్కినేని వనజ, విశాఖ కో–ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు తదితరులు సందర్శించి నివాళులర్పించారు.



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు

ధ్యానంతో ఆత్మస్థైర్యం పెంపు

ఆధ్యాత్మిక గురువు సంత్ సదానందగిరిస్వామి

అవనిగడ్డ: ఆధ్యాత్మికత, ధ్యాన చింతన కలిగి ఉంటే ఎలాంటి సమస్యలనైనా ఎదుర్కొన వచ్చని ఆధ్యాత్మిక గురువు సంత్ సదానందగిరి స్వామి అన్నారు. స్థానిక ఎస్‌వీఎల్ క్రాంతి జూనియర్ కళాశాలలో ఆధ్యాత్మికత – ధ్యానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సదానంద గిరి స్వామి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ధ్యానం నేర్చుకోవాలని, దీని ద్వారా ఆత్మస్థైర్యం పెరుగుతుందని వివరించారు. ధ్యానంలో ముఖ్య అంశాలను విద్యార్థులకు నేర్పించారు. కార్యక్రమంలో పిరమిడ్ మాస్టార్స్ వెలగపూడి లక్ష్మణరావు, పార్థసారథి, ఎస్‌వీఎల్ క్రాంతి విద్యా సంస్థల కరస్పాండెంట్ దుట్టా ఉమామహేశ్వరరావు, ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

● **చల్లపల్లి:** విద్యార్థి దశలో ధ్యానం చేయడం ద్వారా మేధోశక్తి పెరుగుతుందని ఆధ్యాత్మిక గురువు సంత్ సదానందగిరి స్వామి అన్నారు. బుధవారం స్థానిక విజయ క్రాంతి జూనియర్ కళాశాలలో ధ్యానంతో అనంతమైన మేధోశక్తి అంశంపై సదస్సు జరిగింది. ధ్యానంతో లభించే శక్తి విద్యపై శ్రద్ధ, ఏకాగ్రత పెంచుతుందన్నారు. కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ దుట్టా శివరామ ప్రసాద్, అధ్యాపకులు పర్యవేక్షించారు.



మాట్లాడుతున్న ఆధ్యాత్మిక గురువు సంత్ సదానందగిరి స్వామి

ముగిసిన సువార్త సభలు

మచిలీపట్నంటౌన్: నగరంలోని మల్కాపట్నం ఎల్ఈఎఫ్ చర్చిలో మూడు రోజులుగా జరుగుతున్న క్రీస్తు సువార్త సభలు బుధవారంతో ముగిశాయి. ఈ సభలకు చెన్నైకు చెందిన బ్రదర్ జాన్ డానియేల్ హాజరై దైవ వర్తమానాన్ని అందించారు. క్రీస్తు బోధనలు ప్రతి ఒక్కరికీ అనుసరణీయమన్నారు. బైబిల్‌లోని పలు అధ్యాయాల సారాంశాన్ని వివరించారు.

ఎల్ఈఎఫ్ చర్చి సంఘ కాపరి తంటిపూడి ప్రభాకరరావు మాట్లాడుతూ క్రీస్తు సువార్త సభలు విజయవంతంగా జరిగేందుకు సహకరించిన సంఘస్తులకు, దేవునికి కృతజ్ఞతలు తెలిపారు.